వరి వైపే చూపు..

అధికంగా పినపాక, అత్యల్పంగా గుండాల

- సన్నాలకు బోనస్ ఇవ్వడంతో ఆసక్తి
- రెండో ప్రధాన పంటగా మొక్కజొన్న



వరి సాగుకు పొలాన్ని సిద్ధం చేస్తున్న రైతు

మణుగూరు టౌన్: పినపాక నియోజకవర్గ రైతులు ఈ ఏడాది వరిపైనే అధిక దృష్టి సారిస్తున్నారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని రైతులు అధిక శాతం వరి ఆ తర్వాత మొక్కజొన్న, మూడో స్థానంలో పత్తి సాగుకు మొగ్గు చూపుతున్నారని పామాయిల్, మునగ సాగుపై విస్తృతస్థాయిలో ప్రచారం నిర్వహిస్తున్నామని అధికారులు పేర్కొంటున్నారు.

గణాంకాలివి....

నియోజకవర్గంలో 1,49,671.04 ఎకరాల విస్తీర్ణంలో వరి, పత్తి, మొక్కజొన్న పంటలు సాగు చేస్తున్నారు. ఈ మేరకు 56,145.6 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా, అత్యధికంగా పినపాక మండలంలో 13,537 ఎకరాల్లో, అత్యల్పంగా గుండాల మండలంలో 5,357.31 ఎకరాల్లో వరి సాగు చేస్తున్నారు. రెండో ప్రధాన పంటగా మొక్కజొన్నకు రైతులు మొగ్గు చూపుతుండగా, నియోజకవర్గం మొత్తంలో 46,064.1 ఎకరాల్లో సాగు చేస్తుండగా, అత్యధికంగా గుండాలలో 29,519 ఎకరాల్లో సాగు చేస్తుండగా బూర్గంపాడులో ఒక్క ఎకరం కూడా సాగులో లేదు. మూడో ప్రధాన పంటగా ఉన్న పత్తి నియోజకవర్గం మొత్తం 45,982.18 ఎకరాల విస్తీర్ణంలో సాగు చేస్తుండగా, అత్యల్పంగా పినపాక మండలంలో 2,092.23 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. పప్పు దినుసులు, నూనె గింజలు 73.10 ఎకరాల్లో సాగు చేస్తున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పామాయిల్ సాగుపై దృష్టి సారించి అంతరపంటలు వేసి లబ్ధిపొందాలని రైతులకు వివిధ సమావేశాలలో విజ్ఞప్తి చేస్తుండన్నారు. ఈ ఏడాది కలెక్టర్ జితేష్ వి.పాటిల్ 17 మంది ఏఈఓకి ఒక్కొక్కరికి 10 ఎకరాల చొప్పున మునగ సాగు బాధ్యతలు అప్పగించారు. గతేడాది పినపాక మండలం జానంపేట గ్రామంలో వంద ఎకరాల్లో మునగ సాగు చేయగా ఉత్తమ ఫలితాలు సాధించడంతో అధికారులు సాగుపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. ఆయిల్ పాం సాగుపైనా రైతులు ఇప్పుడిప్పుడే దృష్టి సారిస్తుండగా, గతేడాది 200 ఎకరాల్లో సాగు చేయగా, ఈ ఏడాది మరో వెయ్యి ఎకరాల్లో సాగు చేసేందుకు రైతులను దిశానిర్దేశం చేయాలని అధికారులు ఆదేశాలిచ్చారు.

క్వింటాకు రూ.500 బోనస్....

ప్రభుత్వం వరిసాగులో మొత్తం 33 సన్నాలరకాలపై క్వింటాకు రూ.500 బోనస్ ఇవ్వడంతో ఈ ఏడాది రైతులు సన్నాలపైనే మక్కువ చూపుతున్నారు. ప్రభుత్వం నియోజకవర్గంలోని 6,024 మంది రైతులకు రూ.21.4 కోట్లు బోనస్ ద్వారా లబ్ధిపొందారు. దీంతో సన్నాలపైనే మక్కువ చూపుతున్నారు.

ఆదాయం వచ్చే పంటలపై దృష్టి సారించాలి



ఆరుగాలం కష్టపడి పండించిన పంటలు అధిక వర్షపాతం వల్ల నష్టాలు చవి చూస్తున్నారు. దీంతో ఆయిల్ పాం అంతర పంటలుగా మునగ, ఇతర తీగ జాతి పంటలు వేయడం వల్ల ఆరోగ్యం ఆదాయం వస్తుంది. లేదా పూర్తి సాగుగా మునగను ఎంచుకున్నా విశేష లాభాలు పొందవచ్చు. పామాయిల్ సాగు ద్వారా పశువుల బెడద ఉండదు. నష్టం ఉండదు ఆ దిశగా రైతులు ఆలోచన చేసి పామాయిల్, మునగ సాగు చేసి లబ్ధిపొందాలి.

–తాతారావు, ఏడీఏ

క్లుప్తంగా

సరస్వతి విగ్రహావిష్కరణ



విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న క్లబ్ బాధ్యులు

దమ్మపేట: మండల పరిధిలోని గుత్తవారిగూడెం ప్రాథమిక పాఠశాలలో, వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సరస్వతి మాత విగ్రహాన్ని క్లబ్ బాధ్యులు శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం మల్లారం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్, పెన్నులు, దమ్మపేట కోర్టులో వాటర్ ప్యూరీఫయర్‌ను వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు కొత్త వెంకటేశ్వరరావు, మల్లికార్జునరావు, దారా యుగంధర్, అంకత మహేశ్వరరావు, దారా ప్రసాద్, పసుమర్తి రాంభద్రం, చారుగుండ్ల ప్రదీప్, అడపా సాయి, మండవల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రేగాకు పరామర్శ..



నివాళులర్పిస్తున్న మాజీ ఎంపీ కవిత

కరకగూడెం: మాతృవియోగం కలిగిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావును శుక్రవారం మండలంలోని కుర్నవెల్లి గ్రామంలో గల ఆయన స్వగృహంలో మాజీ ఎంపీ మాలోత్ కవితతోపాటు పలువురు పరామర్శించారు. నర్సమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బూర్గంపాడు మాజీ జెడ్పీటీసీ కామిరెడ్డి శ్రీలత, మాజీ ఎంపీపీ రేగా కాళికా, బీఆర్ఎస్ పినపాక మండల అధ్యక్షుడు పగడాల సతీష్ రెడ్డి తదితరులు ఉన్నారు.

టీఆర్‌వీఎస్ జిల్లా అధ్యక్షుడికి..



నివాళులర్పిస్తున్న నాయకులు

ములకలపల్లి: తెలంగాణ రజక వృత్తిదార్ల సంఘం (టీఆర్‌వీఎస్) జిల్లా అధ్యక్షుడు ముదిగొండ రాంబాబు తండ్రి రాఘవులు మృతిచెందగా ఆయన మృతదేహాన్ని సీపీఎం నాయకులు సందర్శించి నివాళులర్పించారు. బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. జిల్లా కార్యదర్శి మచ్చా వెంకటేశ్వర్లు, కార్యదర్శివర్గ సభ్యులు అన్నవరపు సత్యనారాయణ, నాయకులు శ్రీనివాస్, రవికుమార్, మండల కార్యదర్శి రాంబాబు, ఊకంటి రవికుమార్, వెంకటేశ్వర్లు, మధు, ఆదినారాయణ, అంజి, అప్పారావు, నర్సింహారావు తదితరులు ఉన్నారు.

మెడికల్ క్యాంపులు నిర్వహించాలి

మణుగూరు టౌన్: మున్సిపాలిటీలోని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు నిర్వహించి విషజ్వరాలు ప్రబలకుండా తగిన చర్యలు చేపట్టాలని సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం పార్టీ కార్యాలయంలో నాయకులు దుర్గ్యాల సుధాకర్, జక్కుల రాజబాబు మాట్లాడుతూ... చెత్తాచెదారం పెరిగి దోమలు స్వైరవిహారం చేయడంతో ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారన్నారు.

నిరసన

అశ్వారావుపేటరూరల్: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు కొమ్ముకాస్తూ, దేశ సహజ వనరులు, ప్రభుత్వ రంగ సంస్థలను అప్పగించడాన్ని వ్యతిరేకిస్తూ ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్థానిక రింగ్ రోడ్ సెంటర్లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నాయకులు ఎండీ జాకీర్, రామకృష్ణ, రాయల నయోమి, మనుగొండ రాజేశ్వరి, విజయ్‌కాంత్ పాల్గొన్నారు.

కరకట్టకు మరమ్మతులు చేపట్టాలి

భద్రాచలంటౌన్: భద్రాచలం వద్ద గోదావరి నది ప్రవాహం పెరుగుతున్న నేపథ్యంలో కరకట్టకు మరమ్మతు పనులను చేయాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ నాయకులు కెచ్చల రంగారెడ్డి అన్నారు. ఈ మేరకు పట్టణంలోని కొత్త కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, ఎటపాక గ్రామంలోని గోదావరి కరకట్ట పార్టీ బృందం సభ్యులు శుక్రవారం పరిశీలించారు. దాసరి సాయి, శివ, ప్రశాంత్, భాస్కర్, నారాయణ ఉన్నారు.

దాడులు ఆపాలి

బూర్గంపాడు: పోడు రైతులపై ఫారెస్ట్ అధికారుల దాడులు ఆపాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కారం పుల్లయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం సోంపల్లి గ్రామంలో పోడు సాగుదారులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పోడు సాగుదారులకు పట్టా హక్కులు కల్పించి రైతు భరోసా అందించాలన్నారు. మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, ఓర్సు వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

పథకాలకు గుర్తింపుకార్డులు తప్పనిసరి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

చంద్రుగొండ: అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఆదివాసీ గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలంటే తప్పనిసరిగా గుర్తింపుకార్డుల కోసం పేర్లు నమోదు చేసుకోవాలని ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి(జనరల్) డేవిడ్‌రాజు అన్నారు. శుక్రవారం మండలంలోని గుర్రాయిగూడెం పంచాయతీ కార్యాలయంలో ఐటీడీఏ ఆధ్వర్యంలో జరిగిన ధర్తీ ఆబాజాన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ యోజన సదస్సులో సంక్షేమ, అభివృద్ధి పథకాలను వివరించారు. అనంతరం బెండాలపాడులో రూ 6.లక్షల వ్యయంతో పైలట్ ప్రాజెక్టు కింద ఏర్పాటు చేసిన సోలార్ విద్యుత్ ప్యానల్, రెడ్‌కో, సోలార్ పంప్ సెట్ కంపెనీని ఎన్పీడీసీఎల్ అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో రెడ్‌కో జీఎం అజయ్, సోలార్‌పంప్ సెట్ కంపెనీ యజమానులు, ఎన్పీడీసీఎల్ అధికారులు, బ్యాంకు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఇసుక లారీలు నిలిపివేయాలని రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

దుమ్ముగూడెం: మండలంలోని సీతారాంపురం గ్రామంలో ఇసుక లారీల రాకపోకలు నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తూ శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇసుక లారీలతో రోడ్డు పూర్తిగా ధ్వంసమవుతున్నాయని, డ్రైవర్లు అధికవేగంతో తోలుతుంటే రోడ్డుపైకి రావాలంటేనే భయం వేస్తోందన్నారు. ప్రస్తుతం తూరుబాక దగ్గర బ్రిడ్జి వద్ద కల్వర్టు కుంగిపోయిందని ఇసుక లారీలు అధిక బరువుతో దానిపై వెళ్తే అత్యవసర పరిస్థితుల్లో భద్రాచలం వెళ్లే పరిస్థితి కూడా ఉండదన్నారు. ఈ మేరకు సీఐ అశోక్ చేరుకుని గ్రామస్తులతో మాట్లాడి రాస్తారోకోను విరమించారు. బొల్లోజు వేణు, క్రాప వెంకటేశ్వరరావు, చప్పిడి రామచంద్రరావు, అన్నే శ్రీనివాసరావు, కొల్లి కాంతారావు, కోయిలమూడి సాగర్, అలా వెంకటకృష్ణ, మాగంటి వెంకన్న, సురేంద్ర , అనిల్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయి అధికారులదే కీలక పాత్ర



మాట్లాడుతున్న రామకృష్ణ

అశ్వారావుపేటరూరల్: పారదర్శకమైన ఓటర్ల జాబితాను రూపొందించడంలో బూత్ స్థాయి అధికారులదే కీలక పాత్రని అశ్వారావుపేట సహాయ ఎన్నికల రిజిస్ట్రేషన్ అధికారి, తహసీల్దార్ సీహెచ్‌వీ రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక రైతువేదిక భవనంలో నియోజకవర్గ స్థాయి మాస్టర్ ట్రైనర్లు పీఎస్ఎస్‌వీ ప్రసాద్, వి.సత్యనారాయణ, టీ.ఉపేందర్ రెడ్డి ఆధ్వర్యంలో బూత్ లెవల్ అధికారులకు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఫారం-6, 6ఏ, 6బీ, 7, 8తోపాటు బీఎల్‌వో, బ్యాగ్ యాప్‌లపై శిక్షణ ఇచ్చారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఎల్‌వోలు తమ పరిధిలో ఇంటింటి సర్వే చేసి 18 ఏళ్లు నిండిన వారికి ఫారం-6 ద్వారా ఓటు హక్కు నమోదు, ఓటర్ల జాబితాలో సవరణలకు ఫారం-8 ద్వారా దరఖాస్తులు చేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల నాయబ్ తహసీల్దార్ ఎస్‌డీ హుస్సేన్, బీఎల్‌వోలు పాల్గొన్నారు.

42శాతం రిజర్వేషన్ల నిర్ణయంపై హర్షం



మణుగూరు టౌన్: నృత్యం చేస్తున్న నాయకులు

మణుగూరు టౌన్: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడాన్ని హర్షిస్తూ కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబురాలు చేసుకున్నారు. ఈ మేరకు ప్రజాభవన్ వద్ద టపాసులు పేల్చుతూ నృత్యాలు చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు పి.నవీన్, నాయకులు ఉన్నారు.

కరకగూడెం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయం బీసీల అభివృద్ధికి గట్టి పునాది వేస్తుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి బీసీ నాయకులతో కలసి పాలాభిషేకం చేశారు.

మణుగూరు రూరల్ : 42శాతం రిజర్వేషన్ కలిస్తూ నిర్ణయం తీసుకోవడంపై మున్నూరుకాపు సంఘం మండల కార్యదర్శి, కాంగ్రెస్ నాయకులు గాండ్ల సురేష్ శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్ దేశ రాజకీయ చరిత్రలోనే చారిత్రాత్మక నిర్ణయమన్నారు.

అశ్వాపురం: బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఓరుగంటి భిక్షమయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయం వద్ద సంబురాలు జరుపుకున్నారు. బాణసంచా కాల్చి స్వీట్స్ పంచారు. నాయకులు గాదె కేశవరెడ్డి, ఓరుగంటి రమేష్, బూరెడ్డి వెంకటరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తూము వీరరాఘవులు, బచ్చు వెంకటరమణ, ఉపేందర్, వీర భద్రారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కరకగూడెంలో..



అశ్వాపురంలో..

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

దమ్మపేట: మండలంలోని మందలపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ వెంకటరత్నం శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా దమ్మపేట, మందలపల్లి గ్రామాలకు ఉదయం 8 గంటల నుండి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, రైతులు, వినియోగదారులు సహకరించాలని కోరారు.

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో 33కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ సంతోష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు వినాయకపురం సబ్ స్టేషన్‌తోపాటు నారాయణపురం, గంగారం సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు సరఫరాను నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు.

పాఠశాలలో మాక్ పోలింగ్



ఓటు వేస్తున్న ఎస్సై సాయి కిషోర్ రెడ్డి

దమ్మపేట: మండలకేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నికలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు శుక్రవారం మాక్ పోలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణ తీరును వివరించారు. అనంతరం స్కూల్ పీపుల్ లీడర్ ఎన్నికను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట సీఐ నాగరాజు రెడ్డి, ఎంపీడీఓ రవీంద్రరెడ్డి, తహసీల్దార్ భగవాన్ రెడ్డి, ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, హెచ్ఎం ఉషారాణి, ఉపాధ్యాయులు కొండలరావు, మారేశ్వరరావు, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదికి అభినందనలు

దమ్మపేట: మండలంలోని మందలపల్లి గ్రామానికి చెందిన గారపాటి సూర్యనారాయణ కాకతీయ యూనివర్సిటీలో న్యాయశాస్త్రం విద్య పూర్తి చేసుకుని, ఇటీవల యూనివర్సిటీలో జరిగిన స్నాతకోత్సవంలో మూడు బంగారు పతకాలు అందుకున్నాడు. ఈ మేరకు శుక్రవారం గారపాటిని ఎంపీ నామా నాగేశ్వరరావు అభినందించారు.

జ్వర సర్వే



సూచనలిస్తున్న డాక్టర్ నిశాంత్‌రావు

మణుగూరు రూరల్: మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మణుగూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం జ్వర సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యసిబ్బంది గ్రామంలోని ఇంటింటిని సందర్శించి జ్వరంతో బాధపడుతున్న వారి రక్తనమూనాలను సేకరించి మందులు అందించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా నిల్వ నీటిని పారబోయించారు. వైద్యశిబిరాలు ఏర్పాటు చేసి డాక్టర్ నిశాంత్‌రావు వైద్యపరీక్షలు చేసి మందులను పంపిణీ చేశారు. వైద్యసిబ్బంది రాంప్రసాద్, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

కొరవడిన పోలీస్ నిఘా..

- భద్రాచలంలో వరుస ఘటనలతో స్థానికుల బెంబేలు
- శివారు ప్రాంతాలు, కాలనీల్లో తనిఖీలు కరువు

భద్రాచలంఅర్బన్: భద్రాచలంలో పోలీసు నిఘా కొరవడిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పట్టణంలో గత నెలలో జరిగిన వరుస ఘటనలతో ప్రజల భద్రత గాలిలో దీపంలా మారిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాక శివారు ప్రాంతాలు, కాలనీల్లో యువకులు వ్యవహరిస్తున్న తీరు స్థానికులకు ఆందోళన కలిగిస్తోంది. ఇటీవల కార్డెన్ సెర్చ్‌లు నిర్వహించకపోగా, నిత్యం వేలాది మంది భక్తుల భద్రతపై నీలినీడలు కమ్ముకున్నాయి.

వరుస బదిలీలు

భద్రాచలం టౌన్ సీఐగా నాగరాజురెడ్డి రెండేళ్లపాటు విధులు నిర్వర్తించాక 2024 ఫిబ్రవరి 13న బదిలీ చేసి రాయల వెంకటేశ్వర్లును నియమించారు. ఆయన విధుల్లో చేరిన 19 రోజుల్లోనే చుంచుపల్లికి బదిలీ చేశారు. ఈ బదిలీ వెనుక రాజకీయాలు కారణాలు ఉన్నాయనే ప్రచారం జరిగింది. ఆతర్వాత 2024 మార్చి 2వ తేదీన నూతన సీఐగా సంజీవరావు బాధ్యతలు స్వీకరించారు. ఆతర్వాత ఏప్రిల్ 18న టౌన్ పోలీస్‌స్టేషన్‌పై ఏసీబీ అధికారులు దాడి చేసి అప్పటి టౌన్ ఎస్ఐ శ్రీనివాస్, ఓ కానిస్టేబుల్‌తో పాటు మరో వ్యక్తిని అరెస్ట్ చేశారు. అనంతరం 2025 జనవరి 20న భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు బదిలీ అయ్యారు. భద్రాచలం టౌన్ సీఐగా బర్బాటి రమేష్ బాధ్యతలు చేపట్టగా.. ఏప్రిల్ 10న ఓ కేసు విషయంలో డబ్బు తీసుకుంటూ ఆయనతో పాటు గన్‌మెన్ రామారావు, మరో ప్రైవేట్ వ్యక్తి ఏసీబీకి పట్టుబడ్డారు. ఇంతలోనే టౌన్ ఎస్ఐలు పీవీఎన్.రావు, విజయలక్ష్మి సైతం బదిలీ అయ్యారు. ఇలా పోలీసు అధికారుల వరుస బదిలీలతో స్థానికంగా పట్టు సాధించడం కష్టమైంది. ఇక భద్రాచలం టౌన్ ఎస్ఐలుగా స్వప్న, శ్రవణ్ కుమార్ ఏప్రిల్ 14న వచ్చారు. అదేనెల 25న నాగరాజు సీఐగా బాధ్యతలు చేపట్టారు.

రెండు హత్యలు

జూన్ 7న జరిగిన గ్యాంగ్ వార్‌లో ఓ యువకుడు హత్య గురయ్యాడు. అదే నెల 25న ఇద్దరు యువకులు పరస్పరం దాడి చేసుకుంటుండగా అందులో మనోజ్ అదుపుతప్పి ట్రాలీ ఆటో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. హత్య కేసులో 19 మంది అరెస్ట్ చేశారు. ఇలా నిత్యం ఏదో ఘటన జరుగుతున్నా కట్టడిలో పోలీసులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

షీ టీం భవనం ట్రాఫిక్‌కు..

భద్రాచలంలో మహిళల భద్రత దృష్ట్యా షీ టీం విభాగాన్ని ఏర్పాటుచేసి తహసీల్ వద్ద భవనం నిర్మించారు. కానీ ఆ భవనాన్ని టౌన్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ కింద మార్చేశారు. అప్పటి నుంచి భద్రాచలంలో షీ టీం ఏర్పాటుపై నీలినీడలు కమ్ముకున్నాయి. ఇకనైనా భద్రాచలంలో షీ టీంను ఏర్పాటుచేసి ప్రత్యేక భవనం కేటాయించాలనే వినతులు వస్తున్నాయి.

డ్రోన్ ద్వారా నిఘా

వరుస ఘటనలు జరుగుతుండడంతో పట్టణంలో నేరాల నియంత్రణకు పోలీసులు డ్రోన్ కెమెరాల ద్వారా నిఘాకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. శివారు ప్రాంతాలు, కాలనీల్లో డ్రోన్ కెమెరా ద్వారా నిఘా వేస్తే నేరాల అదుపునకు అవకాశముంటుందనే భావన వ్యక్తమవుతోంది. ఇదేసమయాన భద్రాచలంలోని అన్ని సీసీ కెమెరాలకు మరమ్మతు చేయిస్తే మంచి ఫలితాలొస్తాయి. ఈమేరకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.

నాణ్యతతో పనులు చేపట్టాలి..

- ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు



బ్రిడ్జి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

దుమ్ముగూడెం : మండలంలోని తూరుబాక గ్రామ చివారులో భద్రాచలం–చర్ల ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన నాణ్యతతో చేపట్టాలని భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కాంట్రాక్టర్‌కు సూచించారు.శుక్రవారం బ్రిడ్జి నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు.ఈ సంధర్భంగా ఆయన మాట్లాడుతూ... బ్రిడ్జి నిర్మాణ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు, కాంట్రాక్టర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

మోటార్లకు కెపాసిటర్లు అమర్చుకోవాలి



బూర్గంపాడు: జాగ్రత్తలు వివరిస్తున్న ఏడీఈ వేణు



అశ్వాపురం: తురుములగూడెం తండాలో..

బూర్గంపాడు: రైతులు వ్యవసాయ విద్యుత్ మోటార్లకు తప్పకుండా కెపాసిటర్లు అమర్చుకోవాలని విద్యుత్‌శాఖ ఏడీఈ వేణు సూచించారు. ఈ మేరకు మండలంలోని మోరంపల్లిబంజరలో శుక్రవారం విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో పొలంబాట కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వ్యవసాయ విద్యుత్ మోటార్ల వద్దకు వెళ్లి రైతులకు అవగాహన కల్పించారు. కెపాసిటర్లు అమర్చుకోవటంతో ఓల్టేజీలో హెచ్చుతగ్గులకు మోటార్లు కాలిపోకుండా ఉంటాయన్నారు. ఆటోమేటిక్ స్టార్టర్లను ఏర్పాటు చేయొద్దని వాటి వల్ల జరిగే నష్టాలను ఆయన వివరించారు. ఏఈ సారిక పటేల్, విద్యుత్ సిబ్బంది, రైతులు తదితరులు ఉన్నారు.

అశ్వాపురం: విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని తురుములగూడెం తండాలో రైతు పొలంబాట కార్యక్రమం చేపట్టారు. రైతులకు మోటర్ల దగ్గర కెపాసిటర్లు అమర్చుకోవాలని, దీంతో అధిక భారం పడదని అవగాహన కల్పించారు. అక్రమ కనెక్షన్లను రెగ్యులర్ చేసుకోమని, మోటర్ల వద్ద భద్రత చర్యలు పాటించాలన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం



మాట్లాడుతున్న జయభారతి

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని మారుతీ పారామెడికల్ కళాశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ భద్రాచలం అధ్యక్షురాలు కమల రాజశేఖర్ ఆధ్వర్యంలో శుక్రవారం సెమినార్ నిర్వహించారు. డాక్టర్ వి.జయభారతి, క్లబ్ సభ్యులు జీఎస్ శంకర్రావు, యోగి సూర్యనారాయణ, గట్టు వెంకటాచారి, సీహెచ్ రామలింగం, చారి కరస్పాండెంట్ డాక్టర్ ఎస్ఎల్ కాంతారావు, సోమశేఖర్ ఉన్నారు.

హక్కుల సాధనకు ఐక్య పోరాటాలు

కరకగూడెం: బీసీలందరూ ఏకమై వారి న్యాయమైన డిమాండ్ల సాధనకు ఐక్యంగా పోరాడాలని పలు బీసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. జనాభాలో అత్యధిక సంఖ్యలో ఉన్నప్పటికీ బీసీలకు సరైన రాజకీయ, సామాజిక, ఆర్థిక ప్రాతినిధ్యం లభించడం లేదన్నారు. ప్రభుత్వ పథకాల్లో బీసీలకు సముచిత స్థానం కల్పించడంలో జాప్యం జరుగుతోందన్నారు. ఆదివారం భద్రాచలంలోజరిగే 'బీసీల సంక్షేమ సంఘం సమర శంఖారావం' సదస్సుకు బీసీలందరూ భారీగా తరలిరావాలని కోరారు. కొంపెల్లి పెద్దరామలింగం, రావుల సోమయ్య, బైరిశెట్టి చిరంజీవి, వెంకన్న, సిరిశెట్టి కమలాకర్, వెంకటేశ్వర్లు, వసంత్ గౌడ్, బుడగం రాము, బూరగడ్డ రవి, సమ్మయ్య పాల్గొన్నారు.

ప్రయాణం.. ప్రమాదకరం..



పాత సారపాక మలుపు వద్ద గోతుల్లో పెట్టిన పాడైన కూలర్, హెల్మెట్

- బూర్గంపాడు– సారపాక రోడ్డుపై భారీ గుంతలు

బూర్గంపాడు: బూర్గంపాడు–సారపాక మధ్యన రాష్ట్రీయ రహదారి అధ్వానంగా తయారైంది. ఐదు కిలోమీటర్ల మేరా ఈ రహదారి భారీ గుంతలతో ప్రయాణం నరకప్రాయంగా మారింది. 2022లో వచ్చిన గోదావరి వరదలకు ఈ రహదారి నీటమునిగి పూర్తిగా దెబ్బతింది. నాటి నుంచి నేటి వరకు కనీస మరమ్మతులు చేపట్టకపోవటంతో ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి. ప్రమాదం పొంచి వుందని తెలియజేసేందుకు స్థానికులు గోతులలో పాడైన కూలర్, హెల్మెట్ పెట్టి హెచ్చరికలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించాలని కోరుతున్నారు.